ప్రజాశక్తి
శుక్రవారం 22 మార్చి 2024 8 పేజీలు



గుంటూరు
పల్నాడు

నిధులున్నా నిర్లక్ష్యమే..!

పట్టించుకోని జిల్లా యంత్రాంగం - ఎన్నికల కోడ్ రావడంతో చేపట్టని పనులకు బ్రేకులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

నిధుల్లేక పలు శాఖల్లో అభివృద్ధి పనులు ముందుకు సాగక ప్రజలు ఇబ్బంది పడుతుంటే నిధులు అందుబాటులో ఉన్నా రాజకీయ కారణాలతో పనులు పూర్తి చేయకుండా యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైనం వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ రావడంతో ఇప్పటి వరకు చేపట్టని దాదాపు గుంటూరు లోక్‌సభ పరిధిలో 78 పనులు నిలిచిపోయాయి.

ప్రతి పార్లమెంటు సభ్యుడుకి ఏటా రూ.5 కోట్లు ఎంపి ల్యాడ్స్ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుంది. 1991 నుంచి ఈ నిధులు మంజూరవుతున్నాయి. ప్రస్తుత గుంటూరు లోక్‌సభ సభ్యుడు గల్లాజయదేవ్ తన ఎంపి ల్యాడ్స్ నిధుల నుంచి ప్రతిపాదించిన పనులు చాలా వరకు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రధానంగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.4.90 కోట్లకు ఆయన ప్రతిపాదనలిచ్చారు. మొత్తం



76 పనులకు ప్రతిపాదనలివ్వగా 26 మాత్రమే పూర్తయ్యాయి. 21 పనులు వివిధ దశలో ఉన్నాయి. 29 పనులు ప్రారంభం కాలేదు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 94 పనులకు రూ.9 కోట్లకు అధికారులకు ప్రతిపాదనలు అందచేశారు. వీటిల్లో కేవలం 18 పూర్తయ్యాయి. ఇంకా 27 పనులు పురోగతిలో ఉన్నాయి. 49 పనులు ప్రారంభం కాలేదు. 2020-21లో కరోనా కారణంగా నిధులు రాలేదు. 2021-22లో కేవలం రూ.3 కోట్లు వచ్చాయి.

ఈ నిధులను సకాలంలో వినియోగించుకోలేకపోవడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ.5 కోట్లతో పాటు ఆయన నిధులకు మొత్తం వచ్చిన వడ్డీతో కలిపి రూ.9 కోట్లతో పలు మండలాల్లో నిధులను ప్రతిపాదిస్తూ వివరాలను అధికారులకు సమర్పించారు. అయితే కొన్ని మండలాల్లో పనులు చేపట్టగా తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు ఈ ప్రతిపాదనలకు మోకాలడ్డడటంతో ఈ పనులు కాగితాలకే పరిమితమయ్యాయి. నిధులున్నా టిడిపి ఎంపి ప్రతిపాదిత పనుల చేపట్టకూడదని ఇంజినీరింగ్ విభాగం అధికారులపై వైసిపి నేతలు వత్తిడి చేయడం వల్ల పనులు నిలిచిపోయాయి. అయితే గుంటూరు పశ్చిమ, ప్రత్తిపాడు, తాడికొండ నియోజకవర్గాల్లో చేపట్టిన పలు పనులు పూర్తవ్వగా కొన్ని పురోగతిలో ఉన్నాయి.

తెనాలి, పొన్నూరు, మంగళగిరి నియోజకవర్గాల్లో పరిస్థితి భిన్నంగా ఉంది. ప్రధానంగా తాగునీటి వసతులు, కాల్వల మరమ్మతులకు, గ్రామీణ

▶ 2లో




తెనాలి సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్, దుగ్గిరాల తహశీల్దార్ రవిబాబుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు, రైతులు

పసుపు అక్రమంగా తరలింపు

సబ్‌కలెక్టర్, తహశీల్దార్‌కు అగ్ని ప్రమాద బాధిత రైతులు, నాయకుల ఫిర్యాదు - గోడౌన్ సీజ్‌కు సబ్‌కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి - తెనాలి, దుగ్గిరాల

దుగ్గిరాల శుభం మహేశ్వరీ కోల్డ్ స్టోరేజ్ అగ్ని ప్రమాదం సంభవించి పసుపు నష్టపోయిన రైతులకు 62 రోజులు గడుస్తున్నా ఎలాంటి పరిహారం అందలేదని, పైగా గోడౌన్లో సీజ్ చేసిన పసుపును యజమాని అక్రమంగా తరలిస్తున్నాడని సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్‌కు పసుపు రైతుల సంఘం నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. గోదామును తక్షణమే సీజ్ చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ దుగ్గిరాల తహశీల్దార్‌తో మాట్లాడి గోడౌన్‌ను సీజ్‌కు ఆదేశించారు. బాధిత రైతుల సంఘం కన్వీనర్ వేములపల్లి వెంకటరామయ్య, కో-కన్వీనర్ ములకా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పంట నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికి పరిహారం

▶ 2లో

గుంతలో పడి చిన్నారి దుర్మరణం 2లో

మరో 5472 చీరలు స్వాధీనం



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ఓ గోదాములో అక్రమంగా దాచి ఉంచిన చీరలను ఎన్నికల అధికారులు గురువారం పట్టుకున్నారు. సిఎం జగన్ బొమ్మతో ఉన్న 5472 చీరలను ఎన్నికల అధికారులు సీజ్ చేశారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు పారిశ్రామికవాడలోని గోదాములో వీటిని నిల్వ చేశారనే సమాచారంతో ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్

▶ 2లో

అధికారులు స్వాధీనం చేసుకున్న చీరలు.. పరిశీలిస్తున్న అధికారులు (ఇన్‌సెట్)



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

సరిహద్దు చెక్‌పోస్ట్‌ల వద్ద పకడ్బందీగా తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున సరిహద్దుల్లో ఉన్న చెక్ పోస్టుల వద్ద నిఘా పకడ్బందిగా నిర్వహించాలని, తనిఖీలు

▶ 2లో



మాట్లాడుతున్న పల్నాడు కలెక్టర్ ఎల్.శివశంకర్

బ్యాంకు లావాదేవీలపై నిఘా

ప్రజాశక్తి-గుంటూరు

ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో భాగంగా అనుమానాస్పద, అధిక మొత్తంలో జరిగే లావాదేవీల ఖాతాల వివరాలు ఎప్పటికప్పుడు అందించాలని బ్యాంకర్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో

▶ 2లో



రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం) : 6.24

సహరీ (శనివారం ఉదయం) : 4.54



మద్దాలి గిరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ జన్మదిన వేడుకలు గురువారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో ఘనంగా జరిగాయి. మేయర్ కావటి మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, ఎల్.అప్పిరెడ్డి, వైసిపి తూర్పునియోజకవర్గం అభ్యర్థి నూరిఫాతిమా, పలువురు కార్పొరేటర్లు, కార్పొరేటర్లు చైర్మన్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



రోడ్ షోలో పాల్గొన్న పెమ్మసాని, ఆలపాటి, మనోహర్

రూరల్ గ్రామాల్లో కూటమి అభ్యర్థుల రోడ్ షో

ప్రజాశక్తి-తెనాలి

టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థుల ఎన్నికల ప్రచారం రోడ్ షో గురువారం రూరల్ గ్రామాలైన జాకీర్ హుస్సేన్ నగర్, హాఫ్ పేట, కాజీపేట, కొలకలూరు గ్రామాల్లో నిర్వహించారు. గుంటూరు టిడిపి పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ పెమసాని చంద్రశేఖర్, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలల్లో అభివృద్ధి, రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ ఉందంటే అది వైసిపి చేతగాని పాలనకు నిదర్శనమని విమర్శించారు. వైసిపి విముక్త ఆంధ్రప్రదేశ్ కోసం, రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి కోసం కూటమి అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు.

డాక్టర్ బషీర్‌కు అవార్డు



ప్రజాశక్తి-విజయవాడ వన్‌టౌన్‌లోని అయాన్ ఐ హాస్పటల్స్ అధినేత, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ బషీర్ అహ్మద్ మయూఖ్‌కు సర్జన్ ఆఫ్ ది డికేట్ అవార్డును ఇవ్వనున్నామని గీతా విజన్ ట్రస్టు నిర్వాహకులు ప్రకటించారు. గీతా విజన్ ట్రస్టు సంస్థ ప్రతి ఏటా వివిధ రంగాలలో ప్రతిభావంతులకు ఉగాది పురస్కారాలను అందిస్తుందన్నారు. ఇందులో భాగంగానే 2024 ఉగాది పండుగ సందర్భంగా డాక్టర్ బషీర్ అహ్మద్‌ను సర్జన్‌ఆఫ్ ది డికేట్ అవార్డుతో ఘనంగా సత్కరించనుననట్లు తెలిపారు. ఏప్రియల్ 7వ ఏదీన గీతా విజన్ ట్రస్టు బిఆర్‌టిఎస్ రోడ్డులోని గాయత్రీ కళ్యాణ మండపంలో జరిగే వేడుకలలో ఈ పురస్కారాన్ని అందచేయనున్నట్లు తెలిపారు. ఈదశాబ్ద కాలంలో 35 వేలకుపైగా అధునాతన శుక్లాల శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించి కంటి చూపు ప్రసాదించినందుకు డాక్టర్ బషీర్ అహ్మదన్‌ను ఎంపిక చేసినట్లు తెలిపారు.

డిస్పోజబుల్ సిరంజీ విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

డిస్పోజబుల్, ఆటోడైజబుల్ సిరంజీల తయారీలో అగ్రగామి సంస్థల్లో ఒకటైన హిందుస్థాన్ సిరంజిస్ అండ్ మెడికల్ డివైజెస్ (హెచ్‌ఎండి) సంస్థ నగరంలోని ఓ హోటల్‌లో సురక్షితమైన సూదితో కూడిన డిస్పోజబుల్ సిరంజీలను విడుదల చేసినట్లు సంస్థ అధినేతలు రాజీవ్‌నాథ్, సోహైల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలియచేశారు. వైద్య పరికరాల తయారీలో తమ సంస్థ ముందుందని అన్నారు.

గుంతలో పడి చిన్నారి మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గుంతలో పడి చిన్నారి మృత్యువాత పడిన ఘటన గుంటూరు రూరల్ మండలం పెద పలకలూరులో గురువారం జరిగింది. పల్నాడు జిల్లా కారంపూడి మండలం సన్నిగండ్లకు చెందిన మద్దు అశోక్ కుటుంబం పెదపలకలూరులో నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్ వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తోంది. గురువారం నిర్మాణ పరిసరాల్లో ఆడుకుంటున్న వారి ఆరేళ్ల చిన్నారి అమృత.. లిఫ్టుకోసం తవ్విన గుంతలోపడి మృతి చెందింది. నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.



చిన్నారి మృతదేహం

ప్రచారం అనుమతులకు 'సువిధ పోర్టల్'

ప్రజాశక్తి-విజయవాడ

రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమయ్యే వాహనాలు, ఇతర అనుమతుల మంజూరుకు సువిధ పోర్టల్ లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని ఎన్‌టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారికి లేదా అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గం వారికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వాహనాల అనుమతికి సంబంధించి దరఖాస్తుతో పాటు వాహన రిజిస్ట్రేషన్ (ఆర్‌సీ బుక్) వివరాలు, డ్రైవింగ్ లైసెన్సు, వాహన యజమాని పేరు, డ్రైవర్ పేరు, చిరునామా, మొబైల్ నంబరు తదితర వివరాలు జతచేయాలన్నారు. వాహనం సంచరించే ప్రదేశాల వివరాలు, రూట్ మ్యాప్ తెలియజేయాలని.. వాహన తనిఖీ అధికారి (మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్) నుంచి వాహనాన్ని తనిఖీ చేయించుకుని సర్టిఫికేట్ పొందాలన్నారు. తాత్కాలిక ఎన్నికల కార్యాలయం ఏర్పాట్లకు అనుమతి కోసం భవన యజమాని అనుమతి లేదా అద్దె వివరాలు, ఇతర అంచనా వ్యయం తదితర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ర్యాలీలు, రోడ్ షోలకు ప్రదేశం, రూట్ మ్యాప్, ర్యాలీలో పాల్గొనే వారి సంఖ్య, తేదీ, సమయం తదితర వివరాలను తెలియజేసి అనుమతి పొందాలన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-విజయవాడ

స్థానిక లబ్బీపేటలోని శ్రీ దుర్గా మల్లేశ్వర సిద్దార్ధ మహిళా కళాశాలలో కళాశాల విద్యార్థి వికాస వాహిని ఆధ్వర్యంలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం గురువారం కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి, రచయిత డాక్టర్ గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనసులో మెదిలో భావాలను కళాత్మక రూపంలో వర్ణించేదే కవితగా అభివర్ణించారు. సమస్త మానవాళి అంగీకరించని గొప్ప పద్ధతుల్లో కవిత్వం ఒకటిగా పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ రచన, సృష్టి, ప్రచురణ, పఠనాన్ని ప్రోత్సహించాలని , భాషా భిన్నత్వాలను కవితా ద్వారా ఏకంచేసేందుకు యునెస్కో వారు ప్రతి సంవత్సరం మార్చి 21వ తేదీన కవిత్వ దినోత్సవంగా నిర్వహిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ టి. విజయలక్ష్మి, డాక్టర్ నీలిమా చౌడరాజు, విద్యార్థి వికాస వాహిని సెక్రటరీ వి.కేశవరావు, కెఎల్‌యూ ఇంగ్లీషు లెక్చరర్ బి.కిరణ్, గ్రంథపాలకులు మల్లిక, లతాఫణి, విద్యార్థినులు పాల్గొన్నారు.

రియల్‌మి నార్జో 5జి ఆవిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ

తక్కువ కాంతిలో ఫోటోగ్రఫీ ప్రమాణాలతో సరికొత్తగా రియల్ మీ నార్జో 70 ప్రో 5జీ స్మార్ట్‌ఫోన్‌ను మార్కెట్లోకి తీసుకువచ్చినట్లు సంస్థ డైరెక్టర్ రంజిత్ బాబు తెలిపారు. నగరంలోని రియల్ మి స్టోర్ నందు ఏర్పాటుచేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. వినియోగదారుల అభిరుచుల అనుగుణంగా సరికొత్త టెక్నాలజీని జోడించి తీసుకువచ్చినట్లు తెలిపారు.

నిధులున్నా నిర్లక్ష్యమే..!

(మొదటి పేజీ తరువాయి)

రహదారలు నిర్మాణానికి, విద్యుత్ శాఖకు సంబంధించిన పనులకు ఎక్కువగా నిధులు కేటాయించారు. ఈ పనులను పూర్తి చేసేందుకు అధికారులపై వత్తిడి తెచ్చి వైసిపి నాయకులు ససేమిరా అనడంతో ఇంజినీరింగ్ అధికారులు చేష్టలుడి ఉండిపోయారు. దీంతో నిధులు మురిగిపోయి పరిస్థితి ఏర్పడింది. ఎంపి గల్లా జయదేవ్ కూడా స్థానికంగా ఉండకపోవడంతో నిధుల ప్రగతి గురించి ఒక్కసారి కూడా జిల్లా ఉన్నతాధికారులతో సమీక్షించలేదు. ఆయా నియోజకవర్గాల్లో నిధులున్నా పనులు పూర్తి కాకపోవడానికి కారణాలపై ఆయన ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు చేయలేదు. కేవలం ప్రతిపాదనలిచ్చామని, పూర్తి చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మాత్రమే గల్లా జయదేవ్ మౌనంగా ఉండిపోయారు. అయితే ఈ నిధులను వచ్చే ఎన్నికల తరువాత వచ్చే ఎంపి వినియోగించు కోవచ్చునని, కనీసం 18 నెలలపాటు ఈ నిధులు మురిగిపోకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

మరో 5472 చీరలు స్వాధీనం

(మొదటి పేజీ తరువాయి)

తనిఖీకి వెళ్లారు. గోదాముకు తాళం వేసి ఉండడంతో నిర్వాహకునికి ఎన్నికల అధికారులు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి కెవిఎల్ నరసింహారావు తాళాలు పగులగొట్టి తనిఖీ చేశారు. జగన్‌మోహన్‌రెడ్డి బొమ్మ ఉన్న 114 అట్టపెట్టెల్లోని 5472 చీరలను స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. వైసిపి నాయకుని దుకాణంలో 1680 చీరలు బుధవారం ఎన్నికల అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆ మరుసటిరోజే చీరలు బాక్సులు పట్టుకోవడం గమనార్హం. అయితే తాజాగా పట్టుబడిన చీరలు తనవేనని, విక్రయించేందుకు గోదాములో నిల్వ ఉంచామని సత్తెనపల్లి పట్టణానికి చెందిన వస్త్ర దుకాణ నిర్వాహకుడు భవిరిశెట్టి వేణుగోపాల్ ఎన్నికల అధికారులకు చెప్పారు.

సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద పకడ్బందీగా తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

విస్తృతం చేయాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. జిల్లా పరిధిలోని రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీలు చేయాల్సిన విధానాలపై సంబంధిత అధికారులతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట కలెక్టరేట్‌లో గురువారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇంటిగ్రేటేడ్ చెక్ పోస్టులు-3, సరిహద్దు చెక్ పోస్టులు-6, ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్ పోస్టులు-16 ఉన్నాయన్నారు. ఆయా చెక్ పోస్టులలో అవసరమైన సిబ్బందిని త్వరిత గతిన నియమించాలని ఆదేశించారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలో స్వాధీనం చేసుకున్న సామగ్రి, నగదు ఇతర వస్తువులను స్ట్రాంగ్ రూముల్లో భద్ర పరచాలని, ఎన్నికల అనంతరం విచారణ జరిపి తిరిగి అందజేయాలని చెప్పారు. సమీక్షలో జెసి ఎ.శ్యాంప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పసుపు అక్రమంగా తరలింపు

(మొదటి పేజీ తరువాయి)

అందలేదని, బీమా కూడా ఎంత వస్తుందనేది కూడా స్పష్టత లేదని చెప్పారు. ఇప్పటికైనా రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఇదిలా ఉండగా బాధిత రైతులకు న్యాయం కోసం నాయకులు, రైతులు తహశీల్దార్ కె.రవిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. ప్రమాదం జరిగి 62 రోజులైనా రైతులకు జరిగిన నష్టం ప్రభుత్వం గాని, యజమాని గాని, బీమా కంపెనీ నుండి గాని అందించలేదని ఆవేదన వెలిబుచ్చారు. పైగా కోల్డ్ స్టోరేజ్ యజమాని తమ వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారని చెప్పారు. గోడౌన్‌లోని పసుపు పాలిష్ చేసుకుంటూ యథావిధిగా తన కార్యక్రమాలు కొనసాగిస్తున్నాడన్నారు. రైతులకు జరిగిన నష్టానికి బాధ్యత వహించకుండా మోసం చేస్తున్నారని అన్నారు. వినతిపత్రాలిచ్చిన వారిలో నాదెళ్ల సురేంద్ర, వెనిగళ్ల శివయ్య, పోతురాజు కోటేశ్వరరావు, కొల్లి రమేష్, వి.రమేష్, కె.రామచౌదరి, ఎన్.వి.శివరామకృష్ణ, శ్రీనివాసరావు ఉన్నారు.

బ్యాంకు లావాదేవీలపై నిఘా

(మొదటి పేజీ తరువాయి)

నాల్గవ విడతలో ఎన్నికలు జరగనున్నాయని, ఏప్రిల్ 18వ తేదీని నోటిఫికేషన్ జారీ అవుతుందని, మే 13న ఎన్నికలు జరుగుతాయని, ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసిన మార్చి 16వ తేది నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని వివరించారు. పోటీ చేసే ప్రతి లోక్‌సభ అభ్యర్థి రూ.95 లక్షలు, శాసన సభ అభ్యర్థి రూ.40 లక్షల మేర ఖర్చు చేసేందుకు అనుమతి ఉంటుందని, అంతకు మించి జరిగే వ్యయంపై పటిష్టమైన నిఘా ఉంటుందని అన్నారు. ఈ విషయంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలన్నారు. రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థుల బ్యాంకు ఖాతాల నుండి జరిగే లావాదేవీల వివరాలను ఎప్పటి కప్పుడు ఐటి శాఖతో పాటు, జిల్లా ఎన్నికల అధికారికి అందజేయాలన్నారు. అసాధారణంగా, అనుమానాస్పద బ్యాంకు ఖాతాల నుంచి రూ.లక్ష నగదుకు మించి ఉప సంహరణలు, డిపాజిట్ల లావాదేవీలు జరిగితే వివరాలను అందించాలన్నారు. ఒకే బ్యాంకు ఖాతా నుంచి ఒక నియోజకవర్గం లేదా జిల్లాలోని వేర్వేరు బ్యాంకు ఖాతాలకు ఆర్టీజీఎస్ ద్వారా నగదు జమవుతుంటే వివరాలు అందించాలన్నారు. ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన తర్వాత అభ్యర్థులు, వారి సంబంధీకులు గానీ, రాజకీయ పార్టీల బ్యాంకు అకౌంట్ల నుంచి రూ.లక్షకు మించి జరిపే లావాదేవీల వివరాలను కూడా అందించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్న సమయంలో అధిక మొత్తంలో నగదు, లిక్కరు, ఓటర్లను ప్రలోభపరిచే సామగ్రి అక్రమ తరలింపును అరికట్టేందుకు ఐటి, జిఎస్‌టి, పోలీస్, ఎక్సైజ్ తదితర ఎన్ఫోర్సుమెంట్ ఏజన్సీలు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షిస్తున్నాయని తెలిపారు. బ్యాంకులు తరలించే నగదు వివరాలను ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఇఎస్‌ఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకొని క్యూఆర్ కోడ్‌తో రసీదు తీసుకోవాలని సూచించారు. బ్యాంకు నగదును తీసుకువెళుతున్న ఉద్యోగులు, సిబ్బంది గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, నగదుకు సంబంధించిన పత్రాలు, అనుమతులు రసీదులు కలిగి ఉండాలని చెప్పారు. ఎన్నికల అధికారిగానీ, ఇతర తనిఖీ అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు బ్యాంకుల నుంచి నగదు సేకరించినట్లు సంబంధిత పత్రాలు, రసీదులు చూపించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ పి.రోజా, ఆదాయపు పన్ను శాఖ అసిస్టెంట్ కమిషనర్ లలితా, లీడ్ బ్యాంక్ మేనేజరు మహిపాల్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ ఎస్.జవహర్ పాల్గొన్నారు.

మోడల్ పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-తెనాలి
సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ బి శేషన్న గురువారం పట్టణంలోని 1, 13, 29, 40 వార్డులలో పర్యటించారు. అయితా నగర్ హైస్కూలు ఆవరణలోని వికలాంగుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని, వివిఎస్సార్ మోడల్ పోలింగ్ కేంద్రాన్ని, 29వ వార్డులోని యూత్ పోలింగ్ కేంద్రాన్ని, 40 వ వార్డులు మహిళా పోలీస్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనలో జాగ్రత్తలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. అలాగే జెయంజె మహిళా కళాశాలలో ఓటర్ అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఆయన వెంట ఏ సి పి 2 ఎల్ సుబ్బారావు, డిఈ శ్రీనివాసరావు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు..


సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఆర్ఓ పరిశీలన

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్
పొన్నూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఎన్నికల సామాగ్రి భద్రపరిచేందుకు పొన్నూరు సెయింట్ ఆన్స్ స్కూల్లో ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ను గురువారం పొన్నూరు అసెంబ్లీ రిటర్నింగ్ ఆఫీసర్ ఎ.లక్ష్మీకుమారి పరిశీలించారు. సార్వ త్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు వివిఎంలు, ఎన్నికల సామాగ్రి భద్రపరిచి పోలింగ్ రోజున ఎన్నికల సిబ్బందికి డిస్ట్రి బ్యూషన్ చేసేందుకు తగిన వసతులు, సౌకర్యాలు గురించి పర్య వేక్షించారు. పోలింగ్ సామాగ్రిని భద్రపరిచేందుకు అవసరమైన భద్రత గురించి అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. కార్య్ర కమంలో పొన్నూరు తహశీల్దార్, ఎవిఆర్ఒ ఆర్.సూర్యనారాయణ సింగ్, మున్సిపల్ కమిషనర్ ఏఈఆర్ఓ నయీమ్ అహ్మద్, టిఎఒ సాంబయ్య, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ పాల్గొన్నారు.

అధికారులు, నాయకుల కొత్త నాటకం: టిడిపి

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్ : పొన్నూరు పట్టణంలో మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు కొత్త నాటకానికి తెరలేపారని టిడిపి కార్యకర్తలు విమర్శించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో కార్యకర్తలు మాట్లాడుతూ వైసిపి నాయకులు నాలుగేళ్ల కాలం నిద్రపోయి అభివృద్ధిని విస్మరించారని విమర్శించారు. ఎన్నికల కోడ్ మార్చి 16న రాగా



వార్డులలో మున్సి పల్ స్పెషల్ ఆఫీసర్ పై ఒత్తిడి చేసి మార్చి 14న కౌన్సిల్ తీర్మానం చేసినట్లు.. అదే రోజు వర్క్ ఆర్డర్ ఇచ్చినట్లు, 16వ తేదీ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత హడావుడిగా వైసిపి నాయకులు ఒత్తిడి మేరకు మున్సిపల్ అధికారులు పనులు మొదలుపెట్టడం జరిగిందని అన్నారు. ఎన్నికల అధికారులు పనులను నిలుపుదల చేస్తే అదేదో టిడిపి వారు ఆపించారని వైసీపీ నాయకులు విషప్రచార చేస్తున్నారని చెప్పారు. అభివృద్ధిని అడ్డుకోవాల్సిన అవసరం తమ నాయకులకు లేదని, ఆ సంస్కృతి వైసిపి నాయకులేదని అన్నారు. 27 వ వార్డులో ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత రోడ్డు పనులు మొదలుపెడితే ఎన్నికల అధికారులు ఆపుతారని తెలిసి కూడా పనులు మొదలుపెట్టించి అధికారులు ఆపితే టిడిపి వారు ఆపిం చారని ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్లు షేక్ బాజీ సాహెబ్, ఎ.సాంబశివరావు,టి. లక్ష్మీ నారా యణ, టి. ప్రసాద్, ఎ. వీరబాబు, యరసాని శ్రీ రామ మూర్తి, మాజీ కౌన్సిలర్ సిలార్ బాషా పాల్గొన్నారు.



నైపుణ్యాలను మెరుగుపరుచుకోండి

రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ కె. హేమ చంద్రారెడ్డి

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్
కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని మెకానికల్ విభాగం ఆధ్వ ర్యంలో యాంత్రిక -2024 కార్య్ర కమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉన్నత విద్యా మండల చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్ర రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ మెకానికల్ ఇంజినీరింగ్ రంగంలో రాణించాలని ఆకాంక్షించే విద్యా ర్థులు ఆ దిశగా పరిశోధనలు చేయాలన్నారు. అభివద్ధి చెందుతున్న పరిశ్రమల యొక్క డిమాండ్ల పై ఇంజనీర్లు ప్రధాన విభాగాలలో బలమైన పునాదిని కలిగి ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఉత్పాదక రంగంలో మారుతున్న డైనమిక్స్‌కు అనుగుణంగా విద్యా ర్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలన్నారు. అనంతరం పునరుత్పాదక ఇంధన వ్యవస్థల నుండి అధునాతన ఉత్పాదక సాం కేతిక పరిజ్ఞానాల వరకు విభిన్నమైన ప్రాజెక్టుల ద్వారా విద్యా ర్థులు తమ చాతుర్యాన్ని ప్రదర్శించారు.
కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్థ సారధి వర్మ, ప్రో వైస్ ఛాన్సలర్‌బీ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధి పతి డాక్టర్ విజయకుమార్ , విశిష్ట అతిథులు టి చంద్రశేఖర్, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా..కూలీలకు గాయాలు

ప్రజాశక్తి-నకరికల్లు
ఆటో బోల్తా కొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలు కాగా, నలుగురుకి స్వల్ప గాయాలైన సంఘటన గురువారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుండ్లపల్లికి చెందిన సుమారు 15 మంది కూలీలు కారం పూడి పనికి వెళ్లి సాయంత్రం తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగింది. వారు ప్రయాణిస్తున్న ఆటో గుండ్లపల్లి దర్గాకు వద్దకు చేరుకోగానే ఆటో డ్రైవర్ కాబట్టి కోటేశ్వరరావు నిద్ర మత్తులోకి వెళ్లడంతో ఆటో బోల్తా కొట్టింది. గాయపడిన వారిని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు.

టిడిపి ప్రచార వాహనం సీజ్



ప్రజాశక్తి-నకరికల్లు
ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండానే ప్రచారం నిర్వహిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం బుధ వారం సాయంత్రం మండలం లోని బాలాజీ నగర్ తండాలో తెలుగుదేశం పార్టీ ప్రచార వాహనం ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ప్రచార నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి బసవకుమారి ఆ వాహ నాన్ని స్వాధీనం చేసుకుని, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం



ప్రజాశక్తి-దుగ్గిరాల
మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో అక్రమంగా అధిక ధరలకు మద్యం అమ్ము తున్న కొండూరు సాంబయ్య అనే వ్యక్తిని అదుపులో తీసుకొని అతని వద్ద నుండి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై బి బ్రహ్మయ్య తెలిపారు. ఈ నెలలో ఇంతవరకు వివిధ గ్రామాలలో అక్రమంగా అమ్ము తున్న 160 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎన్ని కలు దగ్గర పడుతున్న నేపథ్యంలో పోలీసులు స్పీడు పెంచినట్లు తెలుస్తుంది.



మిర్చి నిల్వలు

	బ్యాగులు
మిర్చి దిగుమతి	: 1,06,381
మిర్చి ఎగుమతి	: 1,04,332
మిర్చి నిల్వ	: 81,360

మిర్చి ధరలు

	రూపాయలలో
334	9,000 - 20,000
నెం.5	9,000 - 15,000
273	12,000 - 19,000
341	9,000 - 18,500
4884	11,500 - 13,500
సూపర్ 10	11,500 - 14,500
	నాన్ ఏసి
తేజ	8,000 - 22,000
బడిగి	9,500 - 19,500
దేవనూరు డీలక్స్	9,000 - 20,000
తాలుకాయలు	5,000 - 12,500

కోడిపందేల స్థావరాలపై దాడులు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్
పొన్నూరు మండలం మాచవరం గ్రామం తుంగభద్ర డ్రెయిన్ కట్టపై నిర్వ హిస్తున్న కోడిపందేల స్థావరాలపై గురు వారం పోలీసులు దాడులు నిర్వహించారు. పొన్నూరు రూరల్ సిఐ కోటేశ్వరరావు, ఎస్ఐ బండ్ల భార్గవ్ ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ దాడులలో 14 మందిని అరెస్టు చేశారు. రూ.33 వేలు నగదు, ఆరు పందెం కోళ్ళు, 16 కత్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి త్వరలో కోర్టు హాజరు పరుస్తామని ఎస్ఐ తెలిపారు.


మాచవరంలో జూదరులను అరెస్టు చేసి, బైక్‌లు, పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్న పొన్నూరు రూరల్ పోలీసులు

బుర్రిపాలెం శివారులో జూదరులు అరెస్టు

ప్రజాశక్తి-నూజెండ్ల
మండలంలోని బుర్రిపాలెం గ్రామ శివారు పొలాల్లో కోతముక్క ఆడే జూదగాళ్లను ఐన వోలు పోలీ సులు అరెస్టు చేశారు. ఎస్ఐ, లక్ష్మినారాయణరెడ్డి, సిబ్బంది దాడి చేసి ఏడు గురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.86,000 నగదు, 7 మోటార్ బైకులు, 7 సెల్ ఫోన్లు స్వాధీనం చేసు కున్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించమని ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ పోలీసు అధికారిగా రామచంద్రరాజు

ప్రజాశక్తి-పల్నాడు



పోలీస్ శాఖలో క్రమశిక్షణకు లోబడి నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వర్తించే సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏడాది ఉగాదికి ప్రకటించే పురస్కారానికి పల్నాడు జిల్లా అడిషనల్ ఎస్పీ (ఎఆర్) డి.రామచంద్రరాజు ఎంపికయ్యారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ తదితరులు

సమస్యాత్మక గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలంలోని కొనకంచివారిపాలెం, గోగులపాడు, రామిరెడ్డిపాలెం తదితర సమస్యాత్మక గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను గురువారం నరసరావుపేట డిఎస్‌పి విఎస్ఎన్ వర్మ పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సమస్యాత్మక గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా జరిగేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు తగు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట రూరల్ సిఐ మల్లికార్జున, ఎస్ఐ కె.పి.రవీంద్రబాబు, పోలింగ్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



కంపెనీ ప్రతినిధులతో ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

ప్రాంగణ ఎంపికల్లో 26 మంది ఎంఎఎం ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసనపల్లి పరిధిలోగల ఎంఎఎం ఫార్మసీ కళాశాలలో ఒమేగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో మెడికల్ కోడింగ్ విభాగంలో జరిగిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు 26 మంది ఉద్యోగాలు సాధించారని కళాశాల కళాశాల ఛైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. ఈ ప్రాంగణ ఎంపికలలో ఒమేగా హెల్త్ కేర్ లీడ్ హెచ్ ఆర్ విజయన్ శేఖర్ పాల్గొని విద్యార్థులకు రాత, గ్రూప్ డిస్కర్షన్ ఇంటర్వ్యూలు నిర్వహించారని పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.2.20 లక్షలు కంపెనీ ప్రతినిధులు చెల్లించనున్నట్లు రామశేషగిరిరావు తెలిపారు. ఉద్యోగాలు సాధించిన వారిని కళాశాల డైరెక్టర్ దరువూరి శ్రావ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ రవితేజ, ఐక్యు ఏసీ కో-ఆర్డినేటర్ డాక్టర్ చందన అభినందించారు.

వీడని కష్టాలు.. తప్పని నష్టాలు..

- ఏటికేడు అప్పుల ఊబిలోకి రైతులు - తీవ్రంగా దెబ్బతీసిన మిర్చి
- సాయం అందక.. పరిహారం దక్కక దిక్కుతోచని రైతులు

సరైన వర్షాల్లేక ఒకేడాది.. మద్దతు ధరలు దక్కక మరో ఏడాది.. నకిలీ విత్తనాలు, పురుగు మందుల బారిన పడి ఇంకో ఏడాది...తెగుళ్ల వల్ల మరో ఏడాది ఇలా ఏటికేడు మిర్చిరైతులు తీవ్రంగా నష్టపోతూనే ఉన్నారు. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినా అవి తిరిగి రాక అప్పులపాలవుతున్నారు. ఈ అప్పుల చిక్కుల్లో కూరుకుపోయిన కొందరు వాటి నుండి బయటపడలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.



తెగుళ్లు సోకిన మిర్చి పైరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలో ఈ ఏడాది సుమారు లక్షా 12 వేల 500 ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్లు వ్యవసాయ శాఖాదికారుల లెక్కలు చెబుతున్నాయి. సాగుదార్లలో 70 శాతానికి పైగా కౌలురైతులే ఉన్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో 70 మందికిపైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే వీరిలో 90 శాతం మంది కౌల్దార్లే కావడం గమనార్హం. అయితే మృతుల కుటుంబాలకు ప్రభుత్వం నుండి సాయమేమీ అందలేదు.

ఈ ఏడాది కూడా మిర్చి పంటలను మిచౌంగ్ తుపాను తుడిచిపెట్టింది. రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. ఈ ఏడాది ఖరీఫ్ ఆరంభంలో మినుము, కంది, శనగ సాగు చేసిన రైతులు సైతం ఇదే పరిస్థితి ఎదుర్కొన్నారు. పైగా వీరంతా పొలాలను దున్ని మళ్లీ మిర్చి సాగు చేయగా ఆ పైరుకు తామర పురుగు, బొబ్బర తెగుళ్ల సోకటంతో మరింత అప్పుల్లో దిగబడ్డారు. ప్రభుత్వం కూడా నీటిపారుదల, వర్షాధారం తదితర సాకులతో పొలాలను బీమా పథకానికి ఎంపిక చేయకపోవడంతో రైతులకు అత్తెసరు సాయమైనా అందలేదు.

ఫలితం.. రూ.1.60 లక్షల నష్టం

బొబ్బాల వెంకటరావు, కౌలురైతు, కాకాని, నరసరావుపేట మండలం.



రెండెకరాల్లో మిర్చి సాగు చేస్తే పెట్టుబడులకు రూ.4 లక్షలయ్యాయి. 18 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. నాణ్యత లేమితో రూ.16 వేలు చొప్పున కొనుగోలు చేశారు. పంటకు ధర వచ్చేదాక నిల్వ చేద్దామంటే అప్పులకు వడ్డీలు పెరుగుతాయనే భయంతో అప్పటికి ఉన్న ధరకే పంటను అమ్మాను.రూ.2.80 లక్షలు వచ్చాయి. పెట్టుబడి వడ్డీలు లెక్క చూస్తే రూ.1.60 లక్షలు నష్టం మిగిలింది.

పంట చేతికొచ్చాక పడిపోతున్న ధరలు

మండాది చక్రవర్తి, బొగ్గరం, ఈపూరు మండలం.



మిర్చి పంట చేతికి వచ్చే సమయానికి ధరలు పడిపోతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్ని పంటలను కొనుగోలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణలో అదేమీ లేదు. నీటి ఎద్దడి ఉన్నా సమీపంలోని బోర్ల నుండి వచ్చే నీటిని నిల్వచేసి ఇంజన్ ద్వారా మిర్చి పొలాలకు పెట్టాం. ఒకవైపు తెగుళ్ల మరొకవైపు మార్కెట్ మాయాజాలంతో ఇబ్బందులు తప్పడం లేదు.

మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

వై.రాధాకృష్ణ, కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు.



తెగుళ్ల బారినపడి పంట నష్టపో యిన మిర్చి రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి. రూ.లక్షల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మిర్చి చేతికొచ్చే సమయంలో బొబ్బర తెగులు, తామర పురుగు సోకడంతో దిగుబడి తగ్గింది. వచ్చిన దిగుబడి కూడా నాణ్యత లేకపోవడంతో పెట్టుబడులైనా తిరిగిరాని పరిస్థితి నెలకొంది. ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా తెగుళ్ళతో 5-10 క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. బాధిత రైతులకు ఎకరాకు రూ.50 వేలు చొప్పున నష్ట పరిహారం చెల్లించాలి.

బీమా సౌకర్యం కల్పించాలి

ఏపూరి గోపాలరావు, రైతుసంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి.



తామర పురుగు, బొబ్బర తెగుళ్లతో మిర్చి పంట 90 శాతం పైగా దెబ్బతింది. సాగు నీటి వసతి ఉన్న భూములకు బీమా సౌకర్యం లేకుండా చేయడం తగదు. మిర్చి సాగుచేసిన రైతులందరికీ వాతావరణ బీమా సౌకర్యం కల్పించాలి. సాగర్ నీరు లేకున్నా ట్యాంకర్‌ల ద్వారా నీటిని కొని మిర్చి సాగు చేసిన రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది.



జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఆ సమస్యలున్న వారికి మూల్యాంకన విధులొద్దు

పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారికి యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, హృద్రోగులకు, గర్భిణులు, బాలింతలకు, ఉద్యోగ విరమణ వయస్సు దగ్గర్లో ఉన్న ఉపాధ్యాయులను 10 తరగతి మూల్యాంకన విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లుకు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.ప్రేమ్‌కుమార్, జి.విజయసారధి మాట్లాడుతూ గతేడాది 10వ తరగతి మూల్యాంకన కేంద్రంలో మౌలిక వసతుల కల్పనలో లోపాలను దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది ఆ లోటుపాట్లు లేకుండా చూడాలని కోరారు. ఉపాధ్యాయుల సంఖ్యకు అనుగుణంగా మరుగుదొడ్లు, తాగునీటి వసతి, ఫ్యాన్లు తదితర సదుపాయాలు కల్పించాలన్నారు. విధులు కేటాయింపులో అనుభవానికి ప్రాధాన్యమివ్వాలన్నారు.

వాణిజ్య పన్నుల శాఖాధికారిగా రంగయ్య బాధ్యతలు

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల వాణిజ్య పన్నుల శాఖాధికారిగా పి వి. రం గయ్య బాధ్యతలు స్వీకరించినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పిడుగురాళ్లలో వాణిజ్య పనుల శాఖ అధికారిగా విధులు నిర్వహించిన పి. చందన హర్ష బదిలీపై కమిషనర్ కార్యాలయానికి వెళ్లినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో



ఓటర్లను ప్రలోభ పెట్టే అభ్యర్థులపై వాణిజ్య పన్నుల శాఖాధికారులు డేగ కన్ను వేశారని, ఓటర్లకు పంపిణీ చేసేందుకు తాయిలాలు ఎక్కడ నుండి దిగుమతి చేసుకుంటున్నారో తదితర విషయాలపై దృష్టి పెట్టారని రం గయ్య తెలిపారు. ఇప్పటికే పలు పార్శిల్ సర్వీస్ సంస్థలను అధికారులు తనిఖీ చేసి నట్లు పేర్కొన్నారు. ఓటర్లకు పంపిణీ చేసేందుకు అభ్య ర్థులు దిగుమతి చేసుకునే వస్తువుల వివ రాలపై 9154970445 వాట్సాప్ నెంబర్ కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.



తాడేపల్లి సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు



మంగళగిరి సమావేశంలో మాట్లాడుతున్న వి కృష్ణయ్య

సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మంగళగిరి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి కృ ష్ణయ్య పిలుపునిచ్చారు. గురువారం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో మంగళగిరి నియోజకవర్గ సిపిఎం సమన్వయ కమిటీ విస్తృత సమావేశం జేవీ రాఘవులు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కృష్ణయ్య మాట్లాడుతూ బిజెపి దేశాన్ని మతపరంగా విభజించి రానున్న ఎన్నికల్లో లబ్ధి పొందడానికి చూస్తుందని విమర్శించారు. దేశ సమగ్రతకు, ప్రజాస్వామ్యానికి, లౌకిక తత్వానికి బిజెపి తూట్లు పొడుస్తుందని విమర్శించారు. ఈసారి ఎన్నికల్లో బిజెపి గెలిస్తే ఇక దేశంలో ఎన్నికలు ఉండవని అన్నారు. నియంతృత్వ పాలన వస్తుందని అన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో బిజెపి దాని మిత్రపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు బిజెపి విధానాలను బలపరుస్తున్నాయని విమర్శించారు. బిజెపితో లోపాయికారిగా ఒప్పందం చేసుకున్న వైసిపిని కూడా ఓడించాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో మంగళగిరి నుండి ఇండియా వేదిక అభ్యర్థిని గెలిపించాలని కోరారు. అదేవిధంగా మంగళగిరిలో అనేక ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఎం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ప్రజల తరపున పోరాటం చేసే సిపిఎం అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం సూర్యారావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం రవి, వై నేతాజీ, ఈమని అప్పారావు, కే నలినీకాంత్, ఎస్ ఎస్ చంగయ్య, తాడేపల్లి సిపిఎం నాయకులు డి వెంకట్ రెడ్డి, బి వెంకటేశ్వర్లు, కే కరుణాకర్ రావు, పి వెంకటేశ్వరరావు, వివిధ ప్రజా సంఘాల నాయకులు కే అజయ్ కుమార్, అరుణ, సిష్టి, పి బాలకష్ణ, మంగళగిరి పట్టణ కార్యదర్శి వై కమలాకర్, ఏం భాగ్యరాజు, ఎం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.


ప్రజాశక్తి-తాడేపల్లి

సిపిఎం జనరల్ బాడీ సమావేశం ఉండవల్లి సెంటర్‌లోని వంశీ అకాడమీలో గురువారం నిర్వహించారు. సమావేశానికి సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.రవి అధ్యక్షత వహించగా సిపిఎం రాష్ట్ర నాయకులు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు ప్రసంగించారు. కేంద్రంలో బిజెపి అధికారంలో అన్ని రకాల ధరలు అధికంగా పెరిగాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కట్టబెడుతుందన్నారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు తగ్గాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అప్పజెప్పేందుకే నల్ల చట్టాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నించే వారిపై నిర్బంధాలను ప్రయోగిస్తుందని విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చాన భారత రాజ్యాంగ లౌకిక స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజల మధ్య చిచ్చుపెట్టి మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన బిజెపిని, దానికి మద్దతు తెలుపుతున్న పార్టీలను రాబోయే ఎన్నికల్లో ఓడించాలన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలంతా ఏకమై రాబోయే ఎన్నికల్లో ప్రజాతంత్ర, వామపక్ష, లౌకికశక్తులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, ఈమని రామారావు, వి.వెంకటేశ్వర్లు, భాగ్యరాజు తదితరులు పాల్గొన్నారు.

అప్పారి వెంకటస్వామికి యుటిఎఫ్ నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

విద్య ప్రైవేటీకరణ సమాజ పతనానికి దారి తీస్తుందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, యం.కళాధర్ అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర తొలి ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి 24వ వర్ధంతి సందర్భంగా స్థానిక బ్రాడీపేటలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రైవేటు విద్యారంగం పెరిగిపోవటం ప్రమాదం అన్నారు. రాబోయే విద్యా సంవత్సరంలో రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచటానికి ఉపాధ్యాయులు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేస్తూ అవినీతికి వ్యతిరేకంగా యుటిఎఫ్ పనిచేయటం అప్పారి చూపిన మార్గం అని అన్నారు. పాలకపక్షం ఏదైనా ఉపాధ్యాయుల, విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పోరాడటమే అప్పారికి అర్పించే నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, ఏఎల్ శివపార్వతి, జిల్లా కార్యదర్శులు జి.వెంకటేశ్వర్లు, యం.గోవిందయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు యం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్, యం. ధనరాజారావు, కె.రంగారావు తదితరులు పాల్గొన్నారు.



గుంటూరు యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో అప్పారి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడండి

వైసిపి నాయకులను నియంత్రించాలని ఎస్‌పికి టిడిపి, జనసేన నాయకుల వినతి

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

టిడిపి నాయకులపై అధికార పార్టీ నాయకుల దాడులను నియంత్రించాలని, ఎన్నికలు సజావుగా సాగేలా నియమ నిబంధనలను అమలు చేయాలని పలువురు నాయకులు గురువారం జిల్లా ఎస్‌పి తుషార్ దూడికి విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ నేతృత్వంలో పలువురు అభ్యర్థులు పెమ్మసాని చంద్రశేఖర్, ప్రత్తిపాడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనేయులు, తెనాలి శ్రావణ్‌కుమార్, నశీర్ అహ్మద్, పిడుగురాళ్ల మాధవి, బిజెపి జిల్లా అధ్యక్షులు వనమా నరేంద్ర,జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు తదితరులు ఎస్‌పిని కలిసి వైసిపి అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. రామాంజనేయులుపై బుధవారం గుంటూరు వికాస్‌నగర్, నల్లపాడు పోలీసుస్టేషన్ వద్ద దాడి జరిగిందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దాడులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అరాచకాలకు అడ్డుకట్ట వేయకపోతే టిడిపి సొంత బలంతోనే ఎన్నికలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. ఎస్‌పిని కలిసిన అనంతరం పెమ్మసాని విలేకరులతో మాట్లాడుతూ ఎస్‌పి, కలెక్టర్ కలిసి ఎన్నికల నిబంధనలపై స్పష్టమైన వైఖరిని అవలంబించాలని కోరామన్నారు. అధికార పార్టీ నాయకులు ఇదే తీరున దాడులకు తెగబడితే చూస్తూ ఊరుకోబోమని, తమదైన పద్ధతిలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని వైసిపి నాయకులను ఆయన హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులు వైసిపి కార్యాలయంలో సమావేశాలు పెట్టి మరీ డబ్బులు, బహుమతులు ఇచ్చే విధంగా సిద్ధపడుతున్నారని, ఎన్నికలను తప్పుదోవ పట్టిస్తున్నారని రామాంజనేయులు ఆరోపించారు.



తొలగించిన కార్మికుల్ని పనిలోకి తీసుకోవాలి

ఎయిమ్స్ డైరెక్టర్‌కు కార్మికుల వినతి

ప్రజాశక్తి మంగళగిరి

ఎయిమ్స్‌లో తొలగించిన సెక్యూరిటీ గార్డ్సను పనిలోకి తీసుకోవాలని సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు గురువారం ఎయిమ్స్ డైరెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఎయిమ్స్‌లో మొత్తం106 మంది కార్మికులు పనిచేయగా వారిలో 2023లో 72 మందిని తొలగించారని, ఎయిమ్స్ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వ ర్యంలో ఆందోళన చేసిన ఫలితంగా 2023 మార్చి 1వ తేదీ నుండి 48 మందిని పనిలోకి తీసుకోవడం జరిగింది. మిగతా 24 మందిని దశల భారీగా తీసుకుంటామని చెప్పి ఇంతవరకు తీసుకోలేదన్నారు. ఆర్‌పిఎఫ్ యాజమాన్యం వారిని ఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. భారత ప్రధానమంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి, కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రికి, వివిధ శాఖలకు చెందిన అధికా రులకు వినతిపత్రం పంపినట్లుగా సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కే వెంకటరావు, బి కొండలు, వి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు



మాట్లాడుతున్న వై నేతాజీ

రేపు భగత్‌సింగ్ వర్ధంతి సభలు జరపాలి

ప్రజాసంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి మంగళగిరి

స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ వర్ధంతి సభలు 23వ తేదీన వాడవాడలా జరపాలని సిఐటియు, రైతు సంఘం, కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఆవాజ్ తదితర ప్రజా సంఘాల జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. మంగళగిరి సిఐటియు కార్యాలయంలో ఈమని అప్పారావు అధ్యక్షతన జరిగిన ప్రజా సంఘాల జిల్లా సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు ఆశించిన లక్ష్యాలకు భిన్నంగా నేటి పాలన కొనసాగుతున్నదని, రాజ్యాంగ స్ఫూర్తి అయిన లౌకిక తత్వం, సామ్యవాదం, ఫెడరల్ విధానం, సామాజిక న్యాయాలకు భిన్నంగా దేశం నియంతృత్వం వైపు పయనిస్తున్నదని నాయకులు పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల, దారిద్ర్యం ప్రజలను తీవ్రంగా బాధిస్తున్నాయని పాలకులివేమి పట్టించుకోకుండా మతోన్మాద ధోరణితో ప్రజల మధ్య అగాధం సృష్టిస్తున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో స్వాతంత్ర ఉద్యమ లక్ష్యాలను పరిరక్షించుకునేందుకు దేశ ప్రజానీకం ఐక్యంగా కదిలి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆయాసంఘాల నాయకులు వై. నేతాజీ, ఏ అజయ్ కుమార్, బైరగాని శ్రీనివాస్, చిష్టి, ఎస్ఎస్, చెంగయ్య, ఎల్ అరుణ, కృష్ణ కాంత్, కిరణ్, ఎం రవి పాల్గొన్నారు.

ఇంటి పన్నులపై దృష్టి పెట్టాలి : కమిషనర్

ప్రజాశక్తి-తాడేపల్లి

ఎంటిఎంసి పరిధిలోని తాడేపల్లిలో ఇంటి పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టాలని ఎంటిఎంసి కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ అన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు, అభివృద్ధి, ఇతర అంశాలపై సచివాలయ అడ్మిన్ సెక్రటరీలతో తాడేపల్లిలోని జోనల్ కార్యాలయంలో ఆయన గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో ట్యాక్స్ కలెక్షన వివరాలు, వసూలు, బకాయిలు, చెల్లింపుల విషయాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు తప్పనిసరిగా వార్డులకు వెళ్లి సామరస్యంగా యజమానులతో మాట్లాడి ట్యాక్స్ కలెక్షన్ చేయాలని ఆదేశించారు. ఎక్కువ బకాయిలు ఉన్న వారిపై దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ బి.శివారెడ్డి, రెవెన్యూ ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్‌కుమార్

'వాగ్దేవి'లో రేపు మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి-నరసరావుపేట

నరసరావుపేట పట్టణ సమీపంలోని రావిపాడు రోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు వాగ్దేవి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కపిలవాయి రాజేంద్రప్రసాద్ గురువారం తెలిపారు.వాగ్దేవి డిగ్రీ కళాశాల,హెచ్.ఆర్ అండ్ కో,హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మెగా జాబ్ మేళాలో ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, బి.టెక్, ఫార్మసీ, డిగ్రీ (2016 నుండి 2024 మధ్య విద్యార్థులు) పిజి విద్యార్థులకు మొత్తం 20 కంపెనీలలో 1000కు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు కళాశాల సెక్రటరీ,కరెస్పాండెంట్ రాయల శ్రీనివాసరావు అన్నారు. ఆసక్తి ఉన్న యువత శనివారం ఉదయం 9 గంటల నుండి కళాశాలలో వారి పేరును రిజిస్టర్ చేసుకోవాలన్నారు. విద్యార్థులు తమ విద్యార్హత పత్రాలతో హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8121212873, 9247025166 నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైసిపికి సర్పంచ్ రాజీనామా

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం కట్టావారిపాలెం సర్పంచ్ మందమంచి పార్వతీకుమారి, ఎంపిటిసి అనురాధ, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మందమంచి రాంబాబు గురువారం రాజీనామా చేశారు. వైసిపిలో తగిన ప్రాధాన్యత, గుర్తింపు లేకపోవడంతో ఇమడలేక తాను రాజీనామా చేసినట్లు రాంబాబు చెప్పారు. పార్టీ కోసం నాలుగు ఎకరాల సొంత వ్యవసాయ భూమిని అమ్ముకున్నాననీ వివరించారు. పార్టీ కోసం కష్టపడి పని చేసినా గుర్తింపు లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఈపూరు తిరుణాళ్ల

ప్రజాశక్తి-ఈపూరు

మండల కేంద్రమైన ఈపూరులో శుక్రవారం శ్రీ బోటిమీద ప్రసన్నాంజనేయ స్వామి తిరుణాళ్ళను నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు గురువారం తెలిపారు.



కందులువారిపాలెం ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న బొర్రా అప్పారావు

'ప్రజలకు అండగా ఉంటా'

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటానని ఇండిపెండెంట్ అభ్యర్థి బొర్రా వెంకట అప్పారావు అన్నారు. గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సత్తెనపల్లి మండలం కందులవారిపాలెంలో గురువారం రాత్రి నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొన్నారు గ్రామంలో పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గ్రామ పెద్దలతో సమావేశమైన ఆయన, గ్రామంలో ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలిపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పి.మల్లారెడ్డి పి.కోటిరెడ్డి, పి.వెంకటరెడ్డి, బి.కృష్ణా రావు, బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నాయకులు షేక్‌బుర్ సైదా మృతి

ప్రజాశక్తి-నాదెండ్ల



సాతులూరు గ్రామ తెలుగుదేశం పార్టీ ముస్లిం మైనారిటీ సీనియర్ నాయకులు షేక్ బుర్ సైదా బుధవారం మృతి చెందారు. గురువారం ఉదయం ఆయన స్వగృహం నుండి అంతిమయాత్ర నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా, 1983 నుండి టిడిపిలోనే సైదా కొనసాగారు. మాజీ జడ్పీటీసీ అయిన ఆయన, ఏ పదవి చేపట్టినా ఆ పదవికి వన్నె తెచ్చారని టిడిపి నాయకులు తెలిపారు.

బటన్ నొక్కి రోజులు ... జమ కాని డబ్బులు

'చేయూత', 'ఆసరా' లబ్ధిదారుల ఎదురుచూపులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చేయూత పథకం చివరి విడత నిధుల విడు దల కోసం ఈ నెల 7న అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని పిసినికాడలో నిర్వహించిన సభలో సిఎం జగన్ కంప్యూటర్ బటన్ నొక్కిన విషయం తెలిసిందే. ఆ బటన్ నొక్కి ఇప్పటికి 15 రోజులు కావస్తోంది. అయినప్పటికీ చిలకలూరిపేట మండలంలోని 'చేయూత' లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఇంతవరకూ ఆ డబ్బు జమ కాలేదు. ఈ పథకం కింద చిలకలూరిపేట మండలంలో సుమారు ఏడు వందల మంది మహిళా లబ్ధిదారులు ఉంటారు. వారి ఖాతాల్లో రూ.18.75 కోట్లు జమకావాల్సి ఉంది. 45 - 60 ఏళ్ల మధ్య ఉన్న పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు ఈ పథకం కింద ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగు విడతల్లో రూ.75 ,000 వేలు ఇవ్వాలి. 'చేయూత' చివరి విడత నిధులు తొలుత ఫిబ్రవరి 5న విడుదల కావాల్సింది వాయిదాల మీద వాయిదాల పడింది. ఫిబ్రవరి 16, 21,26కు వాయిదా వేశారు. చివరికి మార్చి 7న విడుదల చేశారు. కానీ, చిలకలూరిపేట మండలంలోని చేయూత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలు మాత్రం నగదు జమ కాలేదు. దీనిపై లబ్ధిదారులు విమర్శలు చేస్తున్నారు. సామాజిక భద్రత పింఛన్ అందుతున్న మహిళలకు కూడా 'చేయూత' లబ్దిని అందిస్తున్నా మని జగన్ గొప్పలు చెప్పారు. రెండేళ్లుగా ఈ పథకానికి అర్హులను ఎంపి క చేసిన ప్రతిసారి కొత్త దర ఖాస్తు దారులను, పింఛన్ తీసుకుంటున్న వారిని పక్కన పెట్టే యత్నాలు జరిగాయి. గత ఏడాది 'చేయూత' మూడో విడత సందర్భంగా సామాజిక పింఛన్ తీసుకుంటున్న వారిని తప్పించే ప్రయ త్నాలు చేస్తుంటే లబ్ధిదారుల నుంచి వ్యతిరేకత రావడంతో వెనక్కి దగ్గింది. తాజాగా నాలుగో విడతలో కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఒంటరి మహిళలు, వితంతువులు, వికలాంగ మహిళలు ఉన్నారు. ఇలాంటి వారు రెండు మూడు వందలు వరకు ఉంటారు. వారితో కూడా కలిపి లబ్ధిదారులు మొత్తం వెయ్యి మంది వరకు ఉంటారు.

ఇక, ఆసరా పథకం విషయానికొస్తే.. బటన్ నొక్కి సుమారు రెండు నెలలు కావస్తోంది. చిలకలూరిపేటలోనే మొత్తం 1323 గ్రూపులు ఉండగా, వాటిలో 1245 గ్రూపుల వారికి రూ.10 కోట్ల 16 లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ఎన్ని ఖాతాలకు జమ అయిదో ఇంకా ఎన్ని గ్రూప్‌లకు జమ కాలేదో ఖచ్చితంగా తెలియని పరిస్థితి. ఇప్పటికైనా ఆయా లబ్ధిదారులకు, గ్రూప్‌లకు అందాల్సిన డబ్బులు మొత్తం వారి ఖాతాలకు జమ చేయాలని వారు కోరుతున్నారు.

ఘనంగా అటవీ దినోత్సవం

ప్రజాశక్తి - వినుకొండ

ప్రపంచ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక గంగినేని కళ్యాణి డిగ్రీ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా అటవీ శాఖ అధికారి (డిఎఫ్ఒ) ఎస్.రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిఎఫ్ఒ మాట్లాడుతూ మానవ జీవన మను గడకు చెట్లు ఎంతో ముఖ్యమని, చెట్లను, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. చెట్లు, అడవి ప్రాముఖ్యతను విద్యార్థులకు వివ రించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటారు. అనంతరం వెల్లటూరు రోడ్డులో అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న నగరవనాన్ని ఆయన సందర్శించి, జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి సయ్యద్ హుస్సేన్, డిప్యూటీ రేంజ్ అధికారి సురేంద్రబాబు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి.సురేంద్రబాబు పాల్గొన్నారు.



కళాశాల ఆవరణలో మొక్క నాటిన డిఎఫ్ఒ తదితరులు



వర్కర్లకు నూతన వస్త్రాలను అందజేస్తున్న ఉపకులపతి ఆచార్య పి.రాజశేఖర్

బాలుర వసతి గృహ ఉద్యోగులకు వస్త్రాలు పంపిణీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బాలుర వసతి గృహంలో విధులు నిర్వహిస్తున్న వర్కర్లకు రెండు జతల నూతన వస్త్రాలను గురువారం ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ పంపిణీ చేశారు. వసతిగహంలోని కామన్ డైనింగ్ హాల్లో విధులు నిర్వహిస్తున్న వీరికి వర్సిటీ నూతన వస్త్రాలు పంపిణీ ఆనవాయితి. రెక్టర్ ఆచార్య పి .వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ, సిడిసి డిన్ ఆచార్య మధుబాబు, బాలుర వసతి గృహాల చీఫ్ వార్డెన్ ఆచార్య జి.నాగరాజు, అడిషనల్ చీఫ్ వార్డెన్ డాక్టర్ కె.బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.



ఆరోగ్య సురక్షలో కోడ్ ఉల్లంఘన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని క్రిస్టియన్ పేట, ఎన్టీఆర్ నగర్, చౌత్రా, ఎన్జీవో కాలనీ, భారతీపేట, ఎన్టీఆర్ నగర్, జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలల్లో అధికారులు సిఎం జగన్ ఫోటోతో ముద్రించిన సంచుల పంపిణీ వివాదస్పదంగా మారింది. సిఎం జగన్ చిత్రపటంతో ఉన్న సంచులను పంపిణీ చేయడంపై తెలుగుదేశం పార్టీ నేతలు, కార్యకర్తలు నగర కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అలాగే సత్తెనపల్లిలో వైసిపి తరుపున పంపిణీకి సిద్ధంగా ఉంచిన చీరలను అధికారులను స్వాధీనం చేసుకున్నారు. చీరల పెట్టెలపై సిఎం జగన్ చిత్రపటం ఉండటం మరో వివాదానికి దారితీసింది.

జిజిహెచ్‌లో వార్డులను శుభ్రంగా ఉంచండి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి గుండె జబ్బుల వార్డు పరిశుభ్రంగా లేకపోవడం పై పారిశుధ్య సిబ్బంది పై సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అసంతప్తి వ్యక్తం చేశారు. గురువారం గుండె జబ్బుల వార్డును ఆయన పరిశీలించారు. వార్డు రూమ్ లో ట్రాలీ , స్ట్రెచర్ , వీల్ చైర్స్ మూలాన పడేయటం పై ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆసుపత్రి కి గుండె జబ్బుల వార్డు కు రోగులు అనేకమంది వస్తున్నారని వారికి అవసరమైన అవసరాలను గుర్తించి వెంటనే సదుపాయాలను కల్పించాలని సూచించారు. గదులలో చెత్త చెదారం ఉండటం తో పాటు బాత్ రూమ్‌లు పరి శుభ్రంగా లేకపోవడాన్ని ఆయన గమనించారు. వార్డులోని గదులు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత శానిటేషన్ సిబ్బంది పై ఉందని ఆయన అన్నారు. గుడ్స్ ట్రాలీ ని ప్రతి వార్డు కు కేటాయించాలని చెప్పారు. ఇప్పటివరకు వీల్ చైర్స్ లో రోగులకు అవసరమైన మందులు, సిలిండర్లు, మందులు, కేసు షీట్లు తీసుకుని వెళుతున్నారని తెలిపారు. దీనివల్ల రోగులకు అందించాల్సిన వీల్ చైర్స్ వేరే వాటికి ఉపయోగిస్తుండటం వల్ల రోగుల సహాయకులు సైతం అసంతప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఈ విషయాన్నీ కొంతమంది ఫిర్యాదులు చేశారని చెప్పారు.

ఇప్పటికైనా వీల్ చైర్ లలో కేవలం రోగులు మాత్రమే తీసు కుని వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. లోకల్ బడ్జెట్ కింద కొను గోలు చేసి గుడ్స్ ట్రాలీని ప్రతి వార్డుకు కేటా యించాలని అన్నారు. న్యూరో సర్జరీ వార్డు లో రోగులకు అవసరమైన పడకలను అందుబాటులోకి తెస్తున్నట్లు చెప్పారు. గురువారం ఆయన న్యూరో సర్జరీ వార్డును పరిశీలించారు. అంతకుముందు ఈ వార్డు ఇరుకుగా మారడం తో రోగులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుతం ఈ వార్డును పూర్తిగా విస్తరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ విభాగాన్ని లో రెండు యూనిట్లు పని చేస్తున్నాయని అయన చెప్పారు. ఈ విభాగానికి హెచ్ ఓ డి, ఆసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పిజిలు ఉన్నారని ఆయన చెప్పారు. ఈ వార్డు ఆధునీకరణ పూర్తయితే రోగులకు ఎంతో వెసలుబాటు కలుగుతుందని అయన చెప్పారు.

బౌద్ధమతంలో నైతిక విలువలకు ప్రాధాన్యం

తైవాన్ ప్రొఫెసర్ క్రిష్టి చాంగ్



ప్రజాశక్తి - ఎఎన్‌యు

బౌద్ధమతంలో మానవ జీవన గమనం ఇమిడి ఉంటుందని నైతిక విలు వలకు అధిక ప్రాధాన్యత లభిస్తుందని తైవాన్ దేశానికి చెందిన ఆచార్య క్రిస్టీ చాంగ్ అన్నారు. రెండవ రోజు జరిగిన అంతర్జాతీయ సదస్సులో ప్రత్యేక పరిశోధన పత్రాన్ని సమర్పించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బుద్ధిజం విభాగం మూడు రోజుల గ్లోబల్ సెమినార్లో రెండవ రోజు బౌద్ధానికి, విజ్ఞాన శాస్త్రం మనోవిజ్ఞాన శాస్త్రంకి సంబంధించిన అంశాలను వివరించారు. రెండవ రోజు ఎనిమిది సెషన్లలో 40 కి పైగా పరిశోధన పత్రాల సమర్పణ జరిగినట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య ఎల్ .ఉదయ్ కుమార్ తెలిపారు. లావోస్‌లో సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన అంశాలను లావోస్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ బౌశ్రీ పుటవోయింగ్ వివరించారు. ఐఐటీ ముంబై నుంచి వచ్చిన ప్రొఫెసర్ సిడి సెభాస్టియన్ మాట్లాడుతూ మానవ ఆలోచన విధానాలు, భావో ద్వేషాలు మొదలైన అంశాలను వివరించి బౌద్ధంలో అన్ని రకాల సమస్యలకు పరిష్కార మార్గాలు ఉంటాయన్నారు. శ్రీలంక నుంచి పాల్గొన్న ఆచార్య అశోక ప్రియదర్శన మాట్లాడుతూ శాంతియుత, స్వేచ్ఛాయుత సమాజానికి బౌద్ధం ఏ విధంగా దోహదపడుతుందో అనే విషయాలను వివరించారు. ప్రొఫెసర్ ముక్కామల్ హెచ్ భోగ్య మానవ ఆలోచన విధానాల దృక్పథం, క్షణిక ఆలోచన విధానాల గురించి మాట్లాడారు. ఈ సదస్సులో పలువురు బౌద్ధ పరిశోధకులు, మాంక్స్, నన్‌లు వారి వారి పరిశోధన వ్యాసాలను విపులంగా వివరించారు రెండవ రోజు సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య స్వరూప రాణి, సి డి సి డీన్ ఆచార్య కే. మధుబాబు, సిడిఈ డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు, టూరిజం విభాగాధిపతి ఆచార్య పూర్ణచంద్రరావు, తదితరులు పర్యవేక్షించారు.

నిర్మల ఫార్మసీ కళాశాల ద్వి దశాబ్ది వార్షికోత్సవం



ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం ఆత్మకూరు పరిధిలోని నిర్మల ఫార్మసీ కళాశాలలో ద్వి దశాబ్ది వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి పాముల రెడ్డి అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డాక్టర్ కె హేమచంద్రా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, మంచి నడవడికతో ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన ఆచార్య ఎం ఎల్ ఎస్ దేవకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో కుల, వర్గ వివక్షలకు తావు లేకుండా జీవితంలో ఉన్నత ఉద్యోగాలను సాధించి తోటి వారికి సాయపడినప్పుడే వారి విద్యకు నిజమైన అర్థం ఉంటుందని అభిలాష వ్యక్తం చేశారు. నిర్మల విద్యా సంస్థల మదర్ జనరల్ సిస్టర్ జపమాల మాట్లాడుతూ 20 సంవత్సరాల వార్షికోత్సవ వేడుకలలో తాను పాలు పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని, ఎంతోమంది విద్యార్థినీ విద్యార్థులు దేశ విదేశాలలో మంచి స్థాయిలో ఉండటం ఎంతో సంతోషదాయకమని ఆనందం వెలిబుచ్చారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో వివిధ తరగతులలో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు బంగారు పతకం, ప్రశంసా పత్రము మరియు వివిధ కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. బీఫార్మసీ నాలుగో సంవత్సరం చదువుతున్న పి. శశాంక్ - ఉత్తమ విద్యార్థి, మరియు కె. నిహారికలకు ఉత్తమ విద్యార్థిని అవార్డులను అందజేశారు. కార్యక్ర మంలో కళాశాల ప్రెసిడెంట్ సిస్టర్ యు శౌరీలు, సిస్టర్ పి అల్ఫోన్సా, ఫాదర్ యు కిరణ్ కుమార్, సిస్టర్ జాన్ పాల్, సిస్టర్ కె మరియ సుందరి, సిస్టర్ జి నిర్మల జ్యోతి, వివిధ కళాశాల ప్రిన్సిపల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసి గెలిచిన ఆర్కే

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రాజధాని ఇక్కడే ఉంటుందని మంగళగిరి ప్రజలను మోసం చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తి ఆళ్ళ రామకృష్ణారెడ్డి అని టిడిపి జనసేన, తాడేపల్లి రూరల్ అధ్యక్షులు అమరా సుబ్బారావు, సామల నాగేశ్వరరావు అన్నారు. గురువారం సాయంత్రం ఎంటిఎంసీ పరిధిలోని కుంచనపల్లి టిడిపి మండల కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం తాడేపల్లి మండల అధ్యక్షులు అమర సుబ్బారావు మాట్లాడుతూ నారా లోకేష్ ప్రతిపక్షంలో ఉండి మంగళగిరిలో 29 సంక్షేమ పథకాలు అందిస్తున్నారని అన్నారు. బుధవారం సాయంత్రం వైసీపీ ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే నారా లోకేష్ పై చేసిన వ్యాఖ్యలపై టీడిపి, జనసేన నాయకులు ఖండించారు. మంగళగిరి అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. పది సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి మంగళగిరి, తాడేపల్లికి ఏం చేసారో వైసీపీ నాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ పేద, బడుగు వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని అన్నారు. మంగళగిరిలో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చిన ఘనత నారా లోకేష్ కు దక్కుతుందని అన్నారు.గత ఎన్నికల్లో నారా లోకేష్ ఓడిపోయిన ప్రతి గడపకు తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని అన్నారు. గడిచిన కాలంలో ఎమ్మెల్యేలుగా ఉన్న కమల, హనుమంతురావు మంగళగిరిని అభివృద్ధి చేయలేదని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, కొల్లి శేషు, దొంతిరెడ్డి సాంబిరెడ్డితదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గేమింగ్ యాప్‌లు రూపొందించాలి

ప్రొగ్రెషన్ స్కిల్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

లలిత కళల విభాగ విద్యార్థులు చిత్ర షూటింగ్ తో పాటు గేమింగ్ యాప్ లను రూపొందించడంలో మెళ కువలు నేర్చుకోవాలని ప్రోగ్రెషన్ మరియు స్కిల్ డెవలప్మెంట్ డీన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ అన్నారు. రానున్న కాలంలో ఆన్లైన్ గేమింగ్ యాప్ లకు మంచి డిమాండ్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం లలిత కళల విభాగం అధిపతి సుభాష్ ఎలవర్తి తో కలిసి పేజ్ టు పిక్చర్స్ అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన రచయితలు సుప్రజ మరియు ఆర్ వెంకన్న బాబు, జె శ్రీధర్ పట్నాలను అభినందించారు. ఈ ప్రచురణ దశ్యమాన కథా ప్రపంచంలోకి లోతుగా పరిశోధించాలనుకునే వారికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ లలిత కళల విభాగం విద్యార్థులు సినీ ఫిలియా కార్యక్రమంలో భాగంగా పలు రకాల ఫోటో ఆల్బమ్‌లు, వీడియో డాక్యుమెంటరీ లు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సులర్ డాక్టర్ జి. పార్ధ సారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ బీ డాక్టర్ ఎవిఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, విద్యార్థుల ప్రోగ్రెషన్ మరియు స్కిల్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ శ్రీనాథ్, విద్యార్థి సంక్షేమ విభాగ డీన్ సలహాదారు డాక్టర్ హబీబుల్లాఖాన్, లలిత కళల విభాగాధిపతి సుభాష్ యలవర్తి, డిప్యూటీ విభాగాధిపతి జాలాది రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పేజ్ టు పిక్చర్స్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎ.శ్రీనాథ్, సుభాష్ యలవర్తి తదితరులు

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి తెనాలి

ఎన్నికల నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో పోటీ చేసే అభ్యర్థులు ర్యాలీలు నిర్వహించేందుకు ఉపయోగించే వాహనాలకు కచ్చితంగా అనుమతి తీసుకోవాలని రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ జైన్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచించిన సువిధ యాప్ నుంచి కానీ, సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంప్రదించికాని అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు చేసిన 48 గంటల్లో అనుమతులు ఇవ్వడం జరుగుతుందన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై ఎన్నికల నియమావళి ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఎటువంటి సమస్యలున్నా టోల్ ఫ్రీ నెంబర్ 08644 232475 లో ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టినేనికి నివాళి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

మాజీ శాసనసభ్యులు చిట్టినేని వెంకట్రావు 24వ వర్ధంతి సందర్భంగా గురువారం నిడుబ్రోలు లోని చిట్టినేని వెంకట్రావు స్మృతి వనంలో ఆయన సమాధికి పొన్నూరు వైసిపి అసెంబ్లీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతు నిడుబ్రోలులో సుమారు కోటిన్నర వ్యయంతో మాజీ ఎమ్మెల్యే చిట్టినేని వెంకట్రావు మెమోరియల్ పేరిట ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కృషితో పార్కు, వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టారని కొనియాడారు. కార్యక్రమంలో నియోజ కవర్గ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ నాజర్, మొల్లా కరీం ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



ప్రజ్ఞాచారిని సత్కరిస్తున్న పట్టాభి కళాపీఠం బృందం

సాహితీరత్న పూర్ణ ప్రజ్ఞాచారికి సత్కారం

ప్రజాశక్తి - తెనాలి :అంతర్జాతీయ కవితా దినోత్సవం సందర్భంగా గుంటూరుకు చెందిన డాక్టర్ పట్టాభి కళాపీఠం, శ్రీ మక్కేన రామ సుబ్బయ్య ఫౌండేషన్ సాహితి సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బ్రాడీపేట సోషల్ హెల్త్ ఆర్గనైజేషన్ భవనంలో సాహితీ రత్న నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారిని ఘనంగా సత్కరించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులకు ఆహ్వానం పలికి, కవి సమ్మేళనం నిర్వహించారు. కవి సమ్మేళనంలో రూరల్ గ్రామం కొలకలూరు గ్రామానికి చెందిన నూతక్కి పూర్ణప్రజ్ఞాచారి పాల్గొని 'అన్వేషణ' శీర్షికన కవితా పఠనం చేశారు. కవి సమ్మేళనం, కవితా పోటీలలో ప్రజ్ఞాచారి శీర్షిక ఉత్తమ కవితగా ఎంపికైన నేపద్యంలో నిర్వాహకులు తూములూరి రాజేంద్రప్రసాద్, జమదగ్ని, పింగళి భాగ్యలక్ష్మి, పంతులు తదితర సాహితీ ప్రముఖులు పూర్ణ ప్రజ్ఞాచారిని నిర్వాహక సంస్థల తరపున సత్కరించారు.



మాట్లాడుతున్న రాంబాబు

పాఠశాలకు రోటరీ క్లబ్ వితరణ

ప్రజాశక్తి - తెనాలి :కరుణానికి చెందిన రోటరీ క్లబ్ తెనాలి వైకుంఠపురం, సిబార్ దంత వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో పెదకాకాని మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు ఐరన్ బీరువా, వాటర్ కూలర్, బ్యాంబో బ్రష్ లు, పేస్టులు అందించారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు పావులూరి రాంబాబు, సిబార్ దంత వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ ధూళిపాళ్ళ రవీంద్రనాథ్, పాస్ట్ ప్రెసిడెంట్ ఈదర వెంకట పూర్ణ చంద్, ప్రెసిడెంట్ ఎలెక్ట్ ఈదర శ్రీనివాసరావు , జాన్ కీట్స్, డాక్టర్ ఎం కిషోర్, స్కూలు ప్రధానోపాధ్యాయులు మైనేని నాగేశ్వరరావు , పి ఈ టీ సిహెచ్ వినయ కుమార్, స్కూలు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

24న క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ క్షయ దినం సందర్భంగా 24న గుంటూరులో అవగాహన ర్యాలీ, సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టిబి నివారణ అధికారి డి.శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలో మొత్తం ఆరు టీబి యూనిట్ల ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు స్క్రీనింగ్, వైద్య సేవలు అందజేస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎదుర్కొంటు అతిపెద్ద ఆరోగ్య సమస్యలలో క్షయ ఒకటన్నారు. గతంతో పోలిస్తే ఐదేళ్ల నుండి టీబీ కేసులు గణనీయంగా తగ్గుతూ వస్తున్నాయని, ప్రస్తుతం టీబీ నిర్ధారణకు చేసే పరీక్షలు సిబినాట్, ట్రునాట్, వివిధ రకాల స్కానింగ్స్ పరీక్షలు అందుబాటులోకి రావటం వల్ల సులభముగా వ్యాధిని గుర్తించగలుగుతున్నామని చెప్పారు ఆదివారం జరిగే ర్యాలీలో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధిపై అవగాహనకు ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. 24న ఉదయం 8:30 డిఎంహెచ్ఒ కార్యాలయం నుండి జిజిహెచ్ వరకూ ర్యాలీ నిర్వహించి, అనంతరం జిజిహెచ్ సుశ్రుత మీటింగ్ హాల్లో సదస్సు ఉంటుందన్నారు.

డిజిటల్ మీడియాపై నేడు, రేపు వర్క్‌షాప్

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఆధ్వర్యంలో లిడిజిటల్ మీడియా అన్ ఫోల్డింగ్ ఆఫ్ న్యూ ప్రొటెన్షియల్ అనే అంశంపై రెండు రోజుల యుజిసి జాతీయ కార్యాశాల నిర్వహిస్తున్నట్లు కార్యశాల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత తెలిపారు. ప్రారంభ కార్యక్రమంలో వర్సిటీ విసి ప్రొఫెసర్ పి. రాజశేఖర్, సీనియర్ జర్నలిస్ట్, చెన్నై విశ్వ విద్యాలయం మీడియా సైన్సెస్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఆచార్య అరుణ్ ఆరమ్ పాల్గొంటారని తెలిపారు. మొదటి రోజు డిజిటల్ మీడియాపై మాట్లాడేందుకు న్యూ ఢిల్లీలోని గ్రీన్ గోల్డ్ యానిమేషన్ స్టూడియోస్ నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రొడక్షన్ అండ్ కంటెంట్ క్రియేషన్ అండ్ ఫార్మర్ హెడ్ సారథి కృష్ణ, గూగుల్ ఇనిషియేషన్స్ గ్లోబల్ ఎక్సపర్ట్, ద టైమ్స్ ఆఫ్ ఇండియా ఇన్వెస్టిగేషన్స్ ఎడిటర్ ఉడుముల సుధాకర్ రెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం సమాజంలో సోషల్ మీడియాలో వస్తున్న మార్పులు దానివల్ల కలిగే పర్యవసానాలు వంటి వాటిపై కార్యశాల నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

సివిల్ విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - ఎఎన్‌యు



డాక్టర్ సందీపని ని సన్మానిస్తున్న విసి తదితరులు

ఇంజినీరింగ్ చదువుతున్న సివిల్ బ్రాంచ్ విద్యార్థులు నూతన ఆవిష్కంణలపై దృష్టి పెట్టాలని, ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ సూచించారు. విశ్వవిద్యాల యంలోని డాక్టర్ వైయస్సార్ ఇంజనీరింగ్ కళాశాల లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గురు వారం ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ అనే అంశ ంపై రెండు రోజుల జాతీయ సదస్సు గురువారం ప్రారంభ మైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ సివిల్ ఇంజినీరింగ్‌లో కట్టడాలు అనేవి మనకు మన పూర్వకాలంలోని హరప్పా నాగరికత నుంచి ఉన్నాయని పేర్కొన్నారు. ఇంజ నీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య పి. సిద్దయ్య మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్‌లో కొత్త పరిజ్ఞా నాలు అనేకమైనవి వచ్చాయని వాటిని అందిపుచ్చుకోవాలన్నారు. కీలకోపన్యాసకులుగా హాజరైన డాక్టర్ సందీపని మాట్లాడుతు గ్రీన్ బిల్డింగ్స్ ఆవశ్యకత, గ్రీన్ బిల్డింగ్ ఆడిటింగ్, ఎనర్జీ కన్జర్వేషన్, బిల్డింగ్ కోడ్ లను గురించి వివరించారు. మద్రాస్ ఐఐటి ప్రొఫెసర్ డాక్టర్ పి. సుబ్బారావు మాట్లాడుతూ డౌన్ స్కేలింగ్ టెక్నిక్స్ హైడ్రాలజికల్ ఎక్స్ట్రీమ్స్ అండర్ ఛేంజ్ ఇన్ క్లైమేట్ అనే అం శంపై మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీపని ని విసి తదితరులు సన్మానించారు. సద స్సులో ఇంజనీరింగ్ కళాశాల డిన్ ఆచార్య ఈదర శ్రీనివాసరెడ్డి, విభాగాధిపతి డాక్టర్ టీవీఎస్ వర లక్ష్మి, సెమినార్ డైరెక్టర్ పి. నిహారిక, సివిల్ ఇంజనీరింగ్ అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్స్, ఎలైట్ యూనివర్సల్ మధ్య ఒప్పందం

ప్రజాశక్తి-గుంటూరు


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

వడ్ల మూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, ఢిల్లీలోని ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మధ్య గురువారం అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఎలైట్ యూనివర్సల్ స్పోర్ట్స్ అలయన్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సీఈవో మోహిత్ సింగ్ ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘునాథన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన జాతీయ స్థాయిలో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు యూనివర్సిటీ అథ్లెట్లకు ఒక ప్రత్యేక వేదికను కల్పిస్తుందన్నారు. ఔత్సాహిక క్రీడాకారులను గుర్తించి వారిలో ప్రతిభను, క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ అవకాశాలను అందిస్తారన్నారు. మోహిత్‌సింగ్ మాట్లాడుతూ విజ్ఞాన్ యూనివర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువతను ప్రోత్సహించడమే ఈ ఒప్పందం లక్ష్యమన్నారు. తాము నిర్వహిం చే మ్యాచ్‌లు వివిధ ఛానళ్లలో ప్రత్యక్ష ప్రసారం అవుతాయ న్నారు. అగ్రశ్రేణి ప్రతిభను రిక్రూట్ చేయడానికి ఈ అవ గాహన ఒప్పందం ఉప యోగ పడుతుందన్నారు. అథ్లెట్లు ఒలింపిక్స్‌లో పతకాలు సాధించే విధంగా శిక్షణ ఇవ్వడమే తమ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన కేంద్రబృందం

ప్రజాశక్తి-గుంటూరు


ఇంటరాక్టివ్ ప్యానెల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ప్రైమ్ మినిస్టర్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ఎంపిక కోసం రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న సాంకేతిక విద్యాబోధనను పరిశీలించేందుకు ఇద్దరు అధికారులతో కూడిన కేంద్ర బృందం గురువారం గుంటూరు జిల్లాలోని పలు పాఠశాలలను సందర్శించింది. కేంద్ర డిప్యూటీ కార్యదర్శులు ఆశిష్ సక్సేనా, హరీష్ రాయ్, అలాగే ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ జిల్లాలోని పెదకాకాని మండలం వెనిగండ్ల జెడ్పీ హైస్కూల్, గుంటూరు చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, పట్టాభిపురంలోని నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ), బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల ద్వారా జరుగుతున్న బోధనను కేంద్ర అధికారులు పరిశీలించారు. ఇంజినీరింగ్ విద్యార్థులను పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రవేశనపెట్టిన 'ఫ్యూచర్ స్కిల్స్ ఎక్స్‌పర్ట్స్' కార్యక్రమాన్ని పరిశీలించిన అధికారులు విద్యార్థులతో మాట్లాడి, సంతృప్తి వ్యక్తం చేశారు. ట్యాబ్‌ల వినియోగంపై 8, 9 తరగతుల విద్యార్థులతో మాట్లాడిన ఆశిష్ సక్సేనా, హరీష్‌రాయ్ వారిలోని మేధస్సు, సబ్జెక్టుల వారీగా పట్టు, ఇంగ్లీషు భాషలో పరిజ్ఞానాన్ని పరిశీలించారు. బృందం వెంట సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ కేవీ శ్రీనివాసులురెడ్డి, ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి, డీఈవో పి.శైలజ, సీఎస్ఈ ఐటీ సెల్ ప్రతినిధి రమేష్, హెచ్ఎం ఉన్నారు.

అభ్యర్థులు ఖర్చు పెట్టే ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా


మాట్లాడుతున్న పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయికీ లెక్క చెప్పాలని పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. గురువారం నరసరావుపేట కలెక్టరేట్‌లో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఎలక్షన్ నిధుల ఖర్చుల సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకులకు నామినేషన్‌కు వచ్చే సమయంలో ఒక బుక్ ఇవ్వడం జరుగు తుందని, దానిలో బ్యాంక్, క్యాష్, చెక్‌బుక్ ద్వారా ఖర్చు రాయాల్సి ఉంటుందన్నారు. ఈ పుస్తకంలో మొదట మరియు చివరి పేజీలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి సంతకం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థి ఎవరైనా తమకు సంబంధం ఉన్న ఏజెంటు ద్వారా లెక్కలు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయాలన్నీ రాజకీయ పతినిధులు తప్పనిసరిగా రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్లకు తెలియజేయాల్సి ఉంటుందన్నారు. పోటీ చేసే అభ్యర్థులకు తెలియకుండా ఎవరైనా సమావేశాలు, కార్లు, ర్యాలీలు ఇళ్ల మీద జెండాలు తదితర మైనవి పెట్టినప్పటికి ఆ వివరాలు అభ్యర్థుల లెక్కలోనే లెక్కిస్తామన్నారు. అసెంబ్లీ అభ్యర్థి అత్యధికంగా రూ .40 లక్షలు, పార్లమెంటు అభ్యర్థి రూ 95 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుం దన్నారు. ప్రతి అభ్యర్థి ఈ విషయాన్ని గమనించి ఖర్చులను లెక్కలు చూసి ఎప్పటి కప్పుడు బ్యాంక్ ద్వారా డబ్బులు చెల్లించాల్సి ఉంటు oదన్నారు. పార్టీ కార్యాలయాలు, ఇంటింటికి తిరిగి చేసే ప్రచారము, జెండాలు, గోడపై రాతలను ఖర్చు కింద చూస్తామన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం, పోలీస్ అధికారి డి. శ్రీనివాస నాయక్, జిల్లా రవాణా శాఖ అధికారి టి.పరంధామ రెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అధికారి ఐవి. రామకృష్ణ నాయక్, వైసిపి, టిడిపి, జనసేన, సిపిఐ, బి.ఎస్.పి, టిడిపి, ఎఐఎంఐఎం, విసికె తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టిజెపిఎస్ కాలేజీలో క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న రామిరెడ్డి

స్థానిక టిజెపియస్ కళాశాల గణితశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అంతర కళాశాలల క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.వి.బ్రహ్మం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన హిందూ కళాశాల గణిత శాస్త్ర అధ్యాపకులు డాక్టర్.బి.రామిరెడ్డి మాట్లాడుతూ మానవుని నిత్య జీవితంలో గణితం చాలా ప్రాముఖ్యత కలిగివుందని, విద్యార్థులలో దాగివున్న సజనాత్మకతను వెలికితీయడానికి క్విజ్ పోటీలు దోహదం చేస్తాయని చెప్పారు. సెక్రటరీ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి పోటీ ప్రపంచంలో ధైర్యంగా పాల్గొని విజయమార్గం వైపు ముందుకెళ్లాలని చెప్పారు. ప్రిన్సిపాల్ ఏ. బి. పి. మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులలో ఆలోచనా శక్తి, రీజనింగ్, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ, జనరల్ నాలెడ్జి వంటివి అభివద్ధి చెందుతాయన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల, హిందూ కాలేజికి వరుసగా ప్రధమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గణిత విభాగాదిపతి, క్విజ్ సంచాలకులు కె.కవిత, ఉప సంచాలకులు ఆర్.స్వామి, డాక్టర్. జె. వి. సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిఎంసి అడిషనల్ కమిషనర్

పన్నుల వసూళ్లపై అడిషనల్ కమిషనర్ సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

నగర పాలక సంస్థ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారులకు కేటాయించిన టార్గెట్ రూ.33 కోట్లు మార్చి 28 నాటికి పూర్తి చేయాలని జిఎంసి అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి అధికారులను ఆదేశించారు. కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశాల మేరకు రెవెన్యూ వసూళ్ల వేగవంతంపై గురువారం కమిషనర్ ఛాంబర్‌లో డిప్యూటీ కమిషనర్లతో కలిసి రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్స్పెక్టర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో తొలుత 21వ తేది వరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల వారీగా వసూళ్ళ వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిఎంసి ప్రైవేటు డిమాండ్ ద్వారా రూ.63 కోట్లు వసూలు చేయాల్సి ఉందని, ఆర్.ఐ లు వసూళ్లను వేగవంతం చేయాలని, రూ.33 కోట్లను రెవెన్యూ ఇన్స్పెక్టర్ల వారీగా టార్గెట్ విధించారు. ప్రతి ఒక్కరూ నిర్దేశిత టార్గెట్‌ను ఈనెల 28వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వార్డు అడ్మిన్ సెక్రటరీలు ప్రతి ఒక్కరూ ఉదయం 8 గంటలకల్లా వసూళ్లకు వార్డులలో తిరిగేలా చూడాలన్నారు. పెద్ద మొత్తంలో ఉన్న బకాయిదారుల పన్ను వసూళ్ళకు రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు, డిప్యూటీ కమిషనర్లు కూడా పాల్గొని లక్ష్యాలను అధిగమించాలన్నారు. ఖాళీ స్థలం పన్ను వసూళ్లు నూరు శాతం జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్లు చెరువు శ్రీనివాస్, వెంకట కృష్ణయ్య, రెవెన్యూ అధికారులు బాలాజీ బాష, సాంబశివరావు, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.



వర్సిటీలో ప్రపంచ అటవీ దినోత్సవం

ప్రజాశక్తి - ఎఎన్‌యు : ప్రపంచ అటవీ దినోత్సవం పురస్కరించుకొని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ గురువారం మొక్కలు నాటారు. విలువైన ఔషధ మొక్కలను బొటానికల్ గార్డెన్, హెర్బల్ గార్డెన్ లోనాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, భూమి వేడెక్కడం, పర్యావరణ కాలుష్యం, విపరీతమైన వర్షాభావ పరిస్థితులు, జీవవైవిధ్య తరుగుదలకు మొక్కలు పెంచడం మంచి ప్రత్యామ్నాయం అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మొక్కలు నాటాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా మొక్కల సంరక్షణ వాటి సరియైన వినియోగంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎంఎస్‌సి ఫారెస్ట్రీ, ఎంఎస్సీ బోటనీ విద్యార్థులు అడవుల పెంపకం, సంరక్షణ వాటి సరియైన వినియోగంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫారెస్ట్రీ, వృక్ష , సూక్ష్మజీవ శాస్త్ర విభాగాధిపతి ఆచార్య కే మల్లికార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విభాగం ఆధ్యాపకులు ఆచార్య ఉమామహేశ్వరరావు, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ పి ఎస్ ఎన్ రాజు, ఆచార్య ఎస్ ఎమ్ ఖాసిం, డాక్టర్ బాబు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ విజయకుమార్, జ్యోతి రాదిత్య దాస్, డాక్టర్ చిరంజీవి పాల్గొన్నారు.